

అరచేతిలో వైకుంఠం చూపుతూ రేవంత్ పాలన

బోనస్ పేరుతో కాంగ్రెస్ బోగస్ డ్రామాలు

నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలేవీ..?

పదేళ్ల నిజం ఓ వైపు.. ఆర్నెళ్ల అబద్ధాలు మరోవైపు..

బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించాం

మిషన్ భగీరథతో ఫ్లోరైడ్‌ను తరిమికొట్టాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నకిరేకల్, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పట్టభద్రులతో సమావేశం

# సర్కారుపై కొట్లాడేందుకు రాకేశ్‌రెడ్డి గెలువాలి

## హామీల అమలు కోసం బీఆర్ఎస్‌కు అండగా నిలువాలి

## కాంగ్రెస్ తులం బంగారం కాదు కదా తులం ఇనుమూ ఇవ్వదు



చౌటుప్పల్‌లో మునుగోడు నియోజకవర్గ పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే కిశోర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు

నకిరేకల్/చందంపేట(దేవరకొండ), మే 24 : ప్రజలు మరోసారి కాంగ్రెస్ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని, కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నకిరేకల్, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణులతో శుక్రవారం ఆయన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి నకిరేకల్, చౌటుప్పల్, దేవరకొండలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో ఒక హామీ అమలు చేసి, ఐదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. ఫ్రీ బస్సుల్లో సీట్ల కోసం మహిళలు, టికెట్ల కోసం పురుషులు కొట్లాడుకుంటున్నారని చెప్పారు. డిసెంబర్ 9న రుణమాఫీ ఫైల్‌పై సంతకం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు రుణమాఫీ ఊసేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 95శాతం రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని, సన్న బియ్యానికే బోనస్ అని బోగస్ మాటలు చెబుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఇప్పటిదాకా ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదన్నారు. రేవంత్ రెడ్డి లాంటి ఇంద్రజాలికుడిని ఎక్కడా చూడలేదన్నారు. నోటిఫికేషన్లు లేవు, రాత పరీక్షలు లేవని, కానీ 30వేల ఉద్యోగాలు ఇచ్చామని దొంగ మాటలు చెబుతున్నారని విమర్శించారు. అరచేతిలో వైకుంఠం సినిమా చూపిస్తూ అన్నీ వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లుంటున్నదో కూడా ఆలోచించాలన్నారు.

కానీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలిస్తే... ఆయన సొంతం కోసం పైరవీలు, దందాలు, బ్లాక్‌మెయిలింగ్స్ తప్పా ప్రజలకు ఒరిగేదేమి ఉండదన్నారు. అందుకే గోల్డ్ మెడిలిస్ట్ అయిన రాకేశ్‌రెడ్డి కావాలా? తెల్లారి లేస్తే బూతులు తిడుతూ సొంత దందాలు చేసుకునే తీన్మార్ మల్లన్న కావాలో పట్టభద్రులైన ఓటర్లంతా ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ప్రశాంత తెలంగాణను చూసిన మనం నేడు కాంగ్రెస్ హయాంలో హత్యా రాజకీయాలు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. తొమ్మిదిన్నరేండ్ల నిజం, 6నెలల అబద్ధం మీ ముందున్నదని, పట్టభద్రులు ఆలోచన చేయాలని కోరారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఎన్ని పార్టీలు మారిండో, సీఎం రేవంత్ రెడ్డి ఆయన ఎలా తిట్టుకున్నారో అందరికీ తెలుసన్నారు.

ఎన్నో ఏండ్ల నుంచి ఉన్న ఫ్లోరైడ్‌ను తరిమికొట్టిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదని, చౌటుప్పల్‌లో పైలాన్ పార్కును ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా కృష్ణా నీటిని అందించి మహానుభావుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. వెయ్యేండ్లు గుర్తుండి పోయేలా యాదాద్రి దేవాలయాన్ని కేసీఆర్ నిర్మించిచారని చెప్పారు. దండు మల్కాపురంలో ఐటీ పార్కు తీసుకొచ్చామని, చౌటుప్పల్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పెరుగడానికి ఇది ఎంతో దోహద పడిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 65 ఏండ్ల నుంచి మెడికల్ కాలేజీలు లేవని, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడు కాలేజీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశాల్లో యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎన్నికల ఇన్‌చార్జి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చెరుకు సుధాకర్, సందినేని వెంకటేశ్వర్‌రావు, కంకణాల వెంకట్‌రెడ్డి, వడ్త్య రమేశ్‌నాయక్, నేనావత్ కిషన్‌నాయక్, జర్పుల లోక్యానాయక్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, జడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేశ్, తరాల బలరాం, బొప్పని స్వర్ణలతాసురేశ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు నవీన్‌రావు, సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, డిండి ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు టీఎన్ రెడ్డి, దస్రూనాయక్, వల్లపురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, తిరుపతయ్యా, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, నాయకులు శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, వేముల రాజు, కృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాలయ్య, ఆరెకంటి రాములు, వెంకటయ్య, కౌన్సిలర్లు, ఎంపీటీసీ, మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.



నకిరేకల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి కేటీఆర్, జడ్పీచైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, బీఆర్ఎస్ నేతలు చెరుకు సుధాకర్, క్యామ మల్లేశ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు



దేవరకొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, వేదికపై మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే కిశోర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె, బీఆర్ఎస్ నేతలు



దేవరకొండలో సమావేశానికి పెద్ద ఎత్తున హాజరైన పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణులు

### రాకేశ్‌రెడ్డికి బ్రహ్మాండమైన మెజారిటీ ఇవ్వండి

కాంగ్రెస్ అనేక ఆశలు కల్పించి ప్రజలను మోసం చేసింది. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా హామీలు అమలు చేయడం లేదు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల కార్డులు, అమ్మాయిలకు స్కూటీ ఇవన్నీ ఏమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక సెల్‌ఫోన్ లైట్లతో ఆపరేషన్లు చేస్తున్న దౌర్భాగ్య పరిస్థితి వచ్చింది. ఇది చేతగాని, పని చేయలేని, మోసకారి ప్రభుత్వం అని ప్రజలకు అర్థమైంది. ఈ విషయాలపై ప్రభుత్వంపై ప్రశ్నించగలిగిన వారిని శాసనమండలికి పంపించాల్సిన బాధ్యత, పట్టభద్రుల ముందున్న కర్తవ్యం. కేసీఆర్, కేటీఆర్ ఒక మంచి విద్యావంతుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టారు. రైతు కుటుంబం నుంచి వచ్చి సొంతంగా ఎదిగి విదేశాల్లో స్థిరపడే అవకాశం ఉన్నా వదులుకొని తెలంగాణ ఉద్యమకాలంలో వచ్చిన వ్యక్తి రాకేశ్‌రెడ్డి. ప్రజల కోసం పనిచేసే వ్యక్తి, అన్ని విషయాలపై అవగాహన ఉన్న నాయకుడు. పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతాడు. అవసరమైతే వివిధ వర్గాల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడే వ్యక్తి కావాలి. అలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తి రాకేశ్‌రెడ్డి. ప్రశ్నించే గొంతు అని చెప్పుకుంటున్న తీన్మార్ మల్లన్న వల్ల కోమటిరెడ్డి బ్రదర్స్‌కు కొత్త భయం పట్టుకుంది. వీడు వస్తే నా మంత్రి పదవి పీకుతాడా అని వెంకట్‌రెడ్డి, లేకుంటే నా మంత్రి పదవి లాక్కుంటడా అని రాజ్‌గోపాల్‌రెడ్డి భయపడుతున్నరు. గతంలో ఇద్దరిని యూట్యూబ్ చానల్‌లో ఇరుకున పెట్టిన చరిత్ర కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నది. అలాంటి దుర్మార్గుడి చేతికి ఆయుధమిస్తే సమాజానికి ప్రమాదం. అందుకే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

-గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి

### మరోసారి మోస పోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు

కాంగ్రెస్ పార్టీ హామీలతో మోసం చేస్తున్నదని, మరోసారి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రజలు సంతోషంగా జీవనం సాగించారు. నిరుద్యోగులు, విద్యార్థులతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి.

- రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే

### రాకేశ్‌రెడ్డితోనే సమస్యల పరిష్కారం



కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల గుణగణాలు, మంచి చెడులు చూసి పట్టభద్రులు నిర్ణయం తీసుకోవాలి. యూట్యూబ్ చానల్ అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ దందాలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులే బుద్ధి చెప్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. సొంతంగా ఎదిగి బిట్స్ బిలానీలో గోల్డ్ మెడల్ సాధించి విదేశాల్లో ఉద్యోగం పొందినా సొంత ఊరికి ఏమైనా చేయాలనే సంకల్పంతో తెలంగాణకు వచ్చారు. పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తి రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుంటే శాసన మండలిలో తన గళం విప్పి కాంగ్రెస్ ప్రభుత్వంపై కొట్లాడి హక్కులను సాధిస్తాడు.

- చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే

### తీన్మార్ మల్లన్నను ఓడించాలని కాంగ్రెసోళ్లే నిర్ణయం తీసుకున్నరు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసిన కేసులో ఇరుక్కున్న వ్యక్తి. న్యాయం చేస్తామంటూ యూట్యూబ్ చానల్ స్టూడియోకు పిలిపించి బెదిరించి కోట్ల రూపాయలు దండుకున్న ఒక బ్లాక్ మెయిలర్. 56 క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న తీన్మార్ మల్లను ఓడించేందుకు ఆ పార్టీలో ఉన్న వాళ్లే నిర్ణయం తీసుకున్నరు. ఇటువంటి వ్యక్తులను ప్రోత్సహిస్తే రాజకీయాలు కలుషితమైతయని పట్టభద్రులు కూడా ఓడించాలని కంకణం కట్టుకున్నరు. గత నాలుగు పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థులే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడు ఉన్నత విద్యావంతుడు, బిట్స్ బిలానీలో గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తి, విద్యా సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

- బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్

### కాంగ్రెస్ పాలనలో సెల్‌ఫోన్ లైట్లతో ఆపరేషన్ చేసే దుస్థితి

420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 6 నెలలవుతున్నా హామీలు అమలు చేయడంలేదు. అన్ని పేపర్లు, చానళ్లలో చూస్తున్నాం. సెల్ ఫోన్ లైట్లతో భువనగిరి ఆస్పత్రిలో రోగి ఆపరేషన్ చేసిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చింది. 2014 ముందు పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అవే మళ్లీ పునరావృతమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పారదోలే వరకు, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చే వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించకుండా పనిచేయాలి.

-బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీ

### ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా కేటీఆర్ ముందుంటడు

గులాబీ సైనికులు భయపడాల్సిన అవసరం లేదు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుంటారు. కేటీఆర్ నాయకత్వంలో లీగల్ సెల్ ఏర్పాటు చేశారని, కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా లీగల్‌గా ఎదుర్కొందాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 164 రోజులు కావొస్తున్నది. ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. రైతులకు బోనస్ ఇవ్వడం చేతకాదు? మహిళలకు చేయూత కింద రూ.2.500 ఇవ్వడం చేతకాదు? మోసకారి ప్రభుత్వాన్ని ఎండగట్టాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

-దూదిమెట్ల బాలరాజు, గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్

# నేటితో ప్రచారం పరిసమాప్తం

## సాయంత్రం 4గంటల నుంచి అంతా గప్‌చుప్

- హోరాహోరీగా సాగిన ప్రచారం
- పటిష్ట యంత్రాంగంతో బీఆర్ఎస్ దూకుడు
- ప్రతి ఓటర్ తలుపుతట్టిన గులాబీ శ్రేణులు
- కాంగ్రెస్ అభ్యర్థికి హ్యాండిస్తున్న కీలక నేతలు
- పోలింగ్ ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధం
- రేపు డిస్ట్రిబ్యూటర్ కేంద్రాల నుంచి పోలింగ్ సెంటర్లకు సిబ్బంది
- 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్



నల్లగొండ ప్రతినిధి, మే 24 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి సరిగ్గా 48గంటల ముందు ప్రచారాన్ని బంద్ చేయాల్సి ఉంటుంది. దాంతో నేటి సాయంత్రం నాలుగు గంటలతో మైకులు మూగబోయి జెండాలు పక్కకుపోయి అంతా గప్‌చుప్ కానుంది. ఇక ఆ తర్వాత పోల్ మేనేజ్‌మెంట్, పోలింగ్ ప్రక్రియ, ఏజెంట్ల నియామకంపై అభ్యర్థులు పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. ఆదివారం ఉదయం నుంచి నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లా కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూటరీ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి విధులు కేటాయిస్తూ సామాగ్రిని కూడా అందజేయనున్నారు. ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి పోలింగ్ మొదలై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే దాదాపు పూర్తి కావచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన వీటిని పర్యవేక్షిస్తున్నారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఇన్నాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారాన్ని సాగించారు. ఓటర్ల నమోదు నాటి నుంచే మండలి ఎన్నికల హడావుడి మొదలుకాగా బీఆర్ఎస్‌తో పాటు మరి కొందరు అభ్యర్థులు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడానికి ప్రయత్నించారు. చివరగా నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రతి అభ్యర్థి ప్రచారంపైనే పూర్తిస్థాయిలో కేంద్రీకరించారు. హోరాహోరీ ఎన్నికల ప్రచారంతో వాతావారణం పూర్తిగా వేడెక్కింది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరోసారి ప్రజలకు వివరిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మోసాలను ఎండగడుతూ ప్రచారాన్ని నిర్వహించింది. మిగతా అభ్యర్థులు ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పోలిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్ని కోణాల్లోనూ మెరుగైన అభ్యర్థిగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. దాంతో ప్రధాన అభ్యర్థుల్లో రాకేశ్‌రెడ్డి వ్యక్తిత్వం, ఉన్నత విద్య,ఉద్యోగాలు, వ్యక్తిగత వ్యవహారశైలి, విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై విస్తృత అవగాహన, స్పష్టతకు పట్టభద్రుల్లో మంచి ఆదరణ లభించింది ఓ వైపు కాంగ్రెస్ పార్టీ అసత్యారోపణలను తిప్పికొడుతూనే మరోవైపు కేసీఆర్ తెలంగాణను తీర్చిదిద్దిన వైనాన్ని వివరిస్తూ ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కూడా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని చుట్టి వస్తూ సుడిగాలి పర్యటనలు చేశారు. జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మర్లు, రాష్ట్ర, జిల్లా నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నేతల వరకు అంతా ఉప ఎన్నికల ప్రచారంలో భాగస్వాములయ్యారు.

### రేపు డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల నుంచి..

శనివారం సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారానికి తెరపడనుండడంతో అభ్యర్థులంతా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టనున్నారు. అధికారులు మాత్రం పోలింగ్ ఏర్పాట్లపై కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ప్రకటించిన అధికారులు సిబ్బంది నియామకం కూడా పూర్తి చేశారు. వీరందరూ ఆదివారం ఉదయానికే ఆయా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. 12 జిల్లా కేంద్రాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో వీరికి ర్యాండమైజ్ పద్ధతిలో పోలింగ్ కేంద్రాలను కేటాయించనున్నారు. కేటాయించిన విధంగా వీరికి పోలింగ్ సామగ్రిని అందజేసి విధులు నిర్వర్తించాల్సిన ప్రాంతాలకు పంపించనున్నారు. రాత్రికే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 27న ఉదయం 6గంటల వరకే సర్వం సిద్ధంగా ఉండనున్నారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పోలింగ్ ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థుల సంఖ్య 52 ఉండడంతో అందుకు అనుగుణంగా బ్యాలెట్ బాక్స్‌లను, బ్యాలెట్ పేపర్లను, ఇతర సామగ్రిని ఆయా జిల్లా కేంద్రాలకు చేరవేశారు. మరోవైపు పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తును కూడా సిద్ధం చేశారు. వీరంతా రేపటి నుంచి పూర్తి స్థాయిలో విధుల్లోకి వెళ్లనున్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో తాము సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు.

### పైపైనే కాంగ్రెస్ నేతల ప్రచారం


కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గతంలో చేసిన ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, తిట్ల పురాణాలతో ఆ పార్టీ ముఖ్యులు ప్రచారానికి ముఖం చాటేసినట్లు చర్చ జరుగుతున్నది. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్కరోజూ కూడా మల్లన్నకు మద్దతుగా ప్రచారానికి రాలేదు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా దూరంగా ఉన్నారు. జిల్లాలోని మిగతా ఎమ్మెల్యేలు కూడా పైపైనే ప్రచారానికి పరిమితమైనట్లు సమాచారం. ఇక ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రచారం సంగతేమో గానీ... కనీసం తీన్మార్ మల్లన్నను కలిసేందుకు కూడా విముఖత చూపినట్లు సమాచారం. ఇట్లా మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని కీలక నేతలంతా అంటీముట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతున్నది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర నేతలు ప్రచారం చేస్తున్నా, ప్రచార ప్రభావం నామమాత్రంగానే కనిపిస్తున్నది.

### సజావుగా టీఎస్ పాలీసెట్



సూర్యాపేట ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల సెంటర్ ఎదుట పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

రామగిరి/సూర్యాపేట అర్బన్, మే 24 : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ పాలీసెట్- 2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం సజావుగా జరిగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు 3,842మంది విద్యార్థులకుగాను 3,361(బాలురు 1,924, బాలికలు 1,437) మంది హాజరైనట్లు టీఎస్ పాలీసెట్ జిల్లా కో కన్వీనర్, నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేసి పర్యవేక్షించారు.



నల్లగొండలో..

#### సూర్యాపేట జిల్లాలో 2,057 మంది హాజరు

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సూర్యాపేట జిల్లాలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,362 మంది విద్యార్థులకు 305 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పరీక్షల విభాగ అధికారి శ్రీనయ్య, నాయబ్ తాసీల్దార్ స్వప్న పరిశీలించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



కలెక్టరేట్‌లో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మే 24 : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. నల్లగొండలోని కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం పలు శాఖల విభాగాల్లో ఉద్యోగులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకేశ్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడు, సమాజ సేవకుడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ప్రశ్నించే గొంతుక శాసన మండలిలో ఉంటేనే నెరవేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్ రావు, వట్టిపల్లి శ్రీనివాస్, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, సయ్యద్ జాఫర్, మెరగు గోపి, దొడ్డి రమేశ్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.